## క్లుప్తంగా

### క్రికెట్ బెట్టింగ్‌పై దాడి.. ఐదుగురి అరెస్టు

జగ్గంపేట: గుర్రంపాలెంలోని ఒక ఇంట్లో రహస్యంగా నిర్వహిస్తున్న క్రికెట్ బెట్టింగ్ కేంద్రంపై పోలీసులు సోమవారం రాత్రి దాడి చేశారు. ఐపీఎల్ బెట్టింగ్ నిర్వహిస్తున్న నిర్వాహకులు, బెట్టింగ్ వేస్తున్న వారు కలిపి మొత్తం ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై విద్యాసాగర్ తెలిపారు. వీరి నుంచి రూ.34,600 నగదు, ల్యాప్‌టాప్, ఎల్‌ఈడీ టీవీ, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

### నేటి నుంచి సత్యనారాయణుని కల్యాణ మహోత్సవాలు

ఏలేశ్వరం: స్థానిక ఏలేరు నది ఒడ్డున ఉన్న అనంతలక్ష్మీ సమేత సత్యనారాయణస్వామి ఆలయంలో మంగళవారం నుంచి కల్యాణ మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ ఉత్సవాలు వచ్చేనెల 6 వరకూ కొనసాగనున్నాయి. తొలి రోజు ఉదయం అమ్మవారిని, స్వామివారిని వధూవరులుగా అలంకరించనున్నారు. బుధవారం రాత్రి 7 గంటల నుంచి కల్యాణం జరగనుంది. వచ్చే నెల 1న గ్రామోత్సవం, 2న పండిత సత్కారం, 3న విశేషార్చన, హోమం, 4న పూర్ణాహుతి, 5న శ్రీపుష్పయాగం, 6న అన్నదానం నిర్వహించనున్నట్టు అర్చకుడు పొన్నూరు సత్యనారాయణాచార్యులు తెలిపారు.

### పేదలకు దుస్తుల పంపిణీ

జగ్గంపేట: మండల సచివాలయాల కన్వీనర్ బండారు రాజా సోమవారం పేదలకు దుస్తులు, వారపు సంతకు వచ్చే వినియోగదారులకు మజ్జిగ పంపిణీ చేశారు. తన పుట్టిన రోజు సందర్భంగా ఈ కార్యక్రమాలు నిర్వహించామన్నారు.

### చలివేంద్రాలు ప్రారంభం



మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న వాకర్స్‌క్లబ్ ప్రతినిధులు

తుని: స్థానిక వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గొల్లప్పారావు సెంటర్, ఆర్టీసీ బస్ డిపోల వద్ద ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాలను వాకర్స్ ఇంటర్నేషనల్ ఎలక్ట్ గవర్నర్ చదరం శివాజీ సోమవారం ప్రారంభించారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ప్రయాణికుల సౌకర్యార్థం ఈ చలివేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. వడగాల్పులకు గురి కాకుండా ప్రయాణికులు జాగ్రత్తలు పాటించాలని చదరం శివాజీ సూచించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు కుందెం సత్యన్నారాయణ, ప్రతినిధులు కండవల్లి జోషఫ్, పర్వత బాబూరావు, డీవీఎల్ ప్రసాద్, నెల్లిపూడి నాగేశ్వరరావు, వాడపల్లి శ్రీను, డాక్టర్ గణేష్ పాల్గొన్నారు.

### సాగుహక్కు పత్రాలను వినియోగించుకోండి



ఎన్ఎస్‌వీ నగరం సదస్సులో మాట్లాడుతున్న ఏఈఓ జగ్గప్పారావు

తుని రూరల్: కౌలుదారులు సాగుహక్కు పత్రాలను (సీసీఆర్‌సీ) సద్వినియోగించుకోవాలని మండల వ్యవసాయ ఏఈఓ పి.జగ్గప్పారావు అన్నారు. సోమవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో దొండవాక, ఎన్ఎస్‌వీ నగరంలో కౌలుదారుల అవగాహన సదస్సులు జరిగాయి. కార్యక్రమాల్లో పాల్గొన్న ఏఈఓ మాట్లాడుతూ సాగుహక్కు పత్రాలతో రైతులను బహుళ ప్రయోజనాలు పొందవచ్చన్నారు. పంట రుణం, బీమా, రాయితీపై విత్తనాలు, ఎరువులు, పంట విక్రయానికి సీసీఆర్‌సీ కార్డులను ఉపయోపడతాయన్నారు. సొంతభూమిలేని సాగుదారులకు రైతు భరోసా పథకం వర్తిస్తుందన్నారు. ఖరీఫ్‌లో చిరుధాన్యాలు సాగుపైన రైతులు దృష్టి సారించాలన్నారు. ఎన్.ఎస్.వి.నగరం సర్పంచ్ శ్రీరామ్, వీఆర్వోలు, వీఏఏలు, కౌలుదారులు పాల్గొన్నారు.

### ఏలేరులో 76.60 మీటర్ల నీటి నిల్వలు

ఏలేశ్వరం: వేసవితాపం ఎక్కువగా ఉండడంతో ఏలేరు ప్రాజెక్టులో సోమవారం నాటికి నీటినిల్వలు తగ్గుముఖం పట్టాయి. గత కొన్ని రోజులుగా ప్రాజెక్టు పరివాహక ప్రాంతంలో అడపాదడపా వర్షాలు పడుతున్నా ఎండతీవ్రతకు నీటి నిల్వలు తగ్గుతున్నాయి. దిగువ ప్రాంతంలో రబీ సాగు పూర్తికావడంతో నీటి సరఫరా నిలిపివేశారు. ప్రస్తుతం ప్రాజెక్టులో రూ.86.56 మీటర్లకు 76.60 మీటర్లు, 24.11 టీఎంసీలకు 9.80 టీఎంసీల నీటినిల్వలు ఉన్నాయి. దీంతో ప్రాజెక్టు దిగువ ఆయకట్టు, తిమ్మరాజుచెరువు, పంపాకు నీటినిల్వలు నిలిపివేశారు. విశాఖకు 200 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

### నేడు వనమహోత్సవం

అన్నవరం: స్థానిక రత్నగిరి దేవస్థానానికి అన్నవరం రైల్వేస్టేషన్ వద్ద ఉన్న 3.70 ఎకరాల భూమిలో మంగళవారం సాయంత్రం ఐదు గంటలకు వనమహోత్సవం కార్యక్రమం నిర్వహించనున్నట్టు దేవస్థానం అధికారులు తెలిపారు. మారేడు, అరటి తదితర మొక్కలను ఇక్కడ నాటుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఓ చంద్రశేఖర్ అజాద్, ఏసీ రమేష్‌బాబు, ఇతర దేవస్థానం సిబ్బంది పాల్గొంటారని తెలిపారు.

# నిధులు రాక.. సౌకర్యాల్లేక..

- శిథిలావస్థలో గ్రంథాలయం
- వసతుల్లేక పాఠకుల ఇబ్బంది
- పాడైపోతున్న పుస్తకాలు
- ఆక్రమణలో భవనం ముందుభాగం



శిథిలావస్థలో ఉన్న ప్రత్తిపాడులోని శాఖా గ్రంథాలయం

ప్రత్తిపాడు: భాషా వికాసానికి, విజ్ఞానానికి పట్టుకొమ్మలు గ్రంథాలయాలు. ప్రాపంచిక విషయాలు, వర్తమాన వ్యవహారాలు తెలుసుకునే విజ్ఞాన భాండాగారాలు అసౌకర్యాల నడుమ కొనసాగుతున్నాయి. ఒకప్పుడు దినపత్రికలకు కూడా నోచుకోని గ్రంథాలయాలు మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో అభివృద్ధి చెందాయి. గ్రంథాలయాల్లోని ఖాళీ పోస్టులను ఆయన ఔట్ సోర్సింగ్ పద్ధతిపై భర్తీ చేశారు. వైఎస్ మరణానంతరం ఖాళీల భర్తీకి నోచుకోలేదు సరికదా గ్రంథాలయ సంస్థ ఒక్క పైసా నిధులు విడుదల చేయలేదు. పంచాయతీల్లో వీటి సెస్సు రూపేణా లక్షలాది రూపాయలు పేరుకుపోవడం కూడా ఒక కారణం. ప్రత్తిపాడు గ్రంథాలయానికి ఏళ్ల తరబడి మరమ్మతులు లేక శిథిలావస్థకు చేరుకుంది. దీంతో గ్రామ కచేరీ భవనం (ప్రస్తుతం ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం)పై అంతస్తులోకి మార్చారు. ఇక్కడ సౌకర్యాలు లేక పాఠకులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చదువుకోవడానికి తగినన్ని బల్లలు కానీ, కుర్చీలు కానీ లేవు. ఎండలో నిలబడే చదువుకోవాల్సిన దుస్థితి నెలకొంది. గత ఏడాది గ్రంథాలయాధికారి కోటనందూరుకు బదిలీ అయ్యారు. అప్పటి నుంచీ సిబ్బంది నియామకం జరగనేలేదు. అయితే ధర్మవరం గ్రంథాలయంలో పని చేస్తున్న రికార్డు అసిస్టెంట్‌కు అదనపు బాధ్యతగా ఈ గ్రంథాలయాన్ని అప్పగించారు. అతను సక్రమంగా తెరవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు సొంత భవనం ఏర్పాటు చేస్తే విద్యార్థులకు, యువతకు, మహిళలకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందని పాఠకులు కోరుతున్నారు.

**గ్రంథాలయ ఏర్పాటు ఇలా..**

1981లో అప్పటి తూర్పు గోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొప్పన కొండలరావు హయాంలో ప్రత్తిపాడుకు గ్రామీణ గ్రంథాలయం మంజూరైంది. అప్పట్లో పంచాయతీ కార్యాలయంలోని ఓ గదిలో తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. ఆ తదుపరి గ్రామీణ పశు వైద్య కేంద్రానికి నూతన భవనం నిర్మించడంతో 1985లో అప్పటి మంత్రి ముద్రగడ పద్మనాభం కృషితో గ్రామీణ గ్రంథాలయాన్ని అప్ గ్రేడ్ (తెలుగు విజ్ఞాన సమాచార కేంద్రం) చేసి, గ్రేడ్-2 గ్రంథాలయాల జాబితాలో చేర్చారు. ప్రత్తిపాడు గోవిందరాజులు చెరువు గట్టుపై ఉన్న గ్రామీణ పశువైద్యశాలను మరో కొత్త భవనంలోకి మార్చడంతో ఖాళీగా ఉన్న ఆ భవనంలోకి గ్రంథాలయాన్ని తరలించారు. రెండు గదులు మాత్రమే ఉన్న ఈ భవనానికి అప్పటి పంచాయతీ వార్డు మెంబర్ తెంపెళ్ళ చంద్రశేఖర్ రూ.8 వేల పంచాయతీ నిధులతో మెస్, తలుపులు ఏర్పాటు చేసి, వరండాను రీడింగ్ రూంగా తీర్చిదిద్దారు. ఆ నాటి నుంచీ మరమ్మతులు లేకపోవడంతో క్రమేపీ శిథిలస్థితికి చేరుకుంది. పలుమార్లు పాఠకులపై పై కప్పు పెంకులు పడడంతో గాయాలైన సంఘటనలు చోటు చేసుకున్నాయి. ఇలా 2015 వరకూ శిథిలమైన భవనంలోనే గ్రంథాలయం కొనసాగింది. గ్రంథాలయం ప్రవేశ మార్గాన్ని చిరు వ్యాపారులు ఆక్రమించేశారు. ప్రస్తుతం ఈ గ్రంథాలయంలోకి వెళ్లే మార్గం పూర్తిగా ఆక్రమణల చెరలోనే ఉంది.



మూతపడే ఉంటున్న ప్రత్తిపాడు గ్రామ కచేరీ భవనం (ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం) పై అంతస్తులో ఉన్న గ్రంథాలయం

**పుస్తకాలను పెంచాలి**

వసతులు లేక గ్రంథాలయంపై పాఠకులకు ఆసక్తి తగ్గిపోయింది. పుస్తకాలు కూడా పెంచాలి. గ్రంథాలయం ఆక్రమణలపాలవుతోంది. తక్షణం నూతన భవనాన్ని చేపట్టి, పుస్తక భాండాగారాన్ని పాఠకులకు అనుగుణంగా తీర్చిదిద్దాలి.

– గోరస దుర్గాప్రసాద్, పాఠకుడు, ప్రత్తిపాడు

**వారానికి మూడు రోజులే..**

ధర్మవరం గ్రంథాలయంలో పని చేస్తున్నా. ప్రత్తిపాడు గ్రంథాలయం అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో ఇక్కడ వారానికి మూడు రోజులే తెరుస్తున్నాం. దీంతో పాఠకుల సంఖ్య తగ్గిపోయింది. అధికారులు స్పందించాలి.

– వి.సన్యాసి, రికార్డు అసిస్టెంటు, ధర్మవరం గ్రంథాలయం

**పుస్తక భాండాగారానికి చెదలు**

గ్రంథాలయం శిథిలమవడంతో వర్షం వస్తే విలువైన పుస్తకాలు తడిసిపోతున్నాయి. ఈ గ్రంథాలయంలో 14 వేల పుస్తకాలు ఉండేవి. ఇవి కాక ఆరు వార పత్రికలు, ఆరు మాస పత్రికలు, నాలుగు పక్ష పత్రికలు, దిన పత్రికలు వచ్చేవి. గ్రంథాలకు చెద పట్టి, తడిసిపోవడం తదితర కారణాల వల్ల సుమారు ఐదు వేల పుస్తకాలు ధ్వంసమయ్యాయి. ప్రస్తుతం ఏడాదికి జిల్లా గ్రంథాలయ సంస్థ రూ.25 వేలు కేటాయించడంతో దిన పత్రికలు, రెండు వార పత్రికలకే ఈ గ్రంథాలయం పరిమితమైంది. పుస్తకాలు అందుబాటులో లేకపోవడంతో పాఠకుల సంఖ్య క్రమేపీ తగ్గిపోయింది. సొంత భవనం నిర్మించాలన్న ప్రతిపాదన కాగితాలకే పరిమితమైంది. ఏడాదిగా గ్రంథాలయ వారోత్సవాలు కానీ, వేసవి శిక్షణ శిబిరాలు కానీ కనుమరుగయ్యాయి.

### అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

శంఖవరం: స్థానిక ఐసీడీఎస్ పరిధిలోని అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ సోమవారం విడుదల చేసినట్టు సీడీపీఓ పద్మావతి తెలిపారు. ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు ఆరు పోస్టులు ఖాళీలు ఉన్నాయన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు పదో తరగతి పాసై ఉండాలని తెలిపారు. 1-7-2022 నాటికి 21 సంవత్సరం నిండి 35 సంవత్సరాలు లోపు వారు అర్హులన్నారు. ఈ పోస్టులకు స్థానికులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. జూన్ 9వ తేదీ వరకూ సీడీపీఓ కార్యాలయంలో దరఖాస్తులు తీసుకోవాలన్నారు. ఏలేశ్వరం మండలం అప్పన్నపాలెం-ఎస్టీ అంగన్‌వాడీ కార్యకర్త పోస్టు ఖాళీగా ఉందన్నారు. ఆరు హెల్పర్ పోస్టులకు సంబంధించి శంఖవరం మండలం వి.వెంకటాపురం-ఓసీ, రౌతులపూడి మండలం ఎం.చామవరం-ఎస్సీ, ప్రత్తిపాడు మండలం పీఎస్ పూడి బీసీ-ఏ, ఏలేశ్వరం మండలం అప్పన్నపాలెం – ఓసీ, ఏలేశ్వరం-2లో ఓసీ, ఏలేశ్వరం-9లో ఎస్సీ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు.

### మూడు తాటాకిళ్లు దగ్ధం

రౌతులపూడి: స్థానిక ఎస్సీపేటలో సోమవారం జరిగిన అగ్నిప్రమాదంలో మూడు తాటాకిళ్లు దగ్ధమయ్యాయి. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా జరిగిన ఈ ప్రమాదంలో కొప్పాల రావయమ్మ, కొప్పాల శ్రీను, బీజా సత్తిబాబు, దమ్ము కిశోర్‌లకు చెందిన ఇళ్లు పూర్తిగా కాలిబూడిదయ్యాయి. ఈ ప్రమాదంలో దుస్తులు, ఫర్నిచర్, ఎలక్ట్రానిక వస్తువులు, వంట సామగ్రి తదితర పలు విలువైన వస్తువులు కాలిబూడిదయ్యాయని వాపోయారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న వీఆర్‌ఓ ప్రమాదస్థలానికి వచ్చినష్టాన్ని అంచనా వేశారు. నివేదికను తహసీల్దారుకు అందజేస్తామన్నారు. అగ్నిప్రమాద బాధితులను సోమవారం ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ పరామర్శించారు. ప్రమాదస్థలానికి వచ్చిన బాధితులకు జరిగిన నష్టాన్ని పరిశీలించారు. ప్రభుత్వం నుంచి అన్ని సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు వాసిరెడ్డి భాస్కరబాబు,పులి మదు, జిగిరెడ్డి శ్రీను పాల్గొన్నారు.

## రౌతులపూడిలో ఎమ్మెల్యే బైక్ ర్యాలీ



రౌతులపూడిలో బైక్ ర్యాలీ చేస్తున్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్ తదితరులు

రౌతులపూడి: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు పూర్తయిన చేసుకున్న సందర్భంగా మండల కేంద్రమైన రౌతులపూడిలో ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ స్థానిక పార్టీ నేతలు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలతో సోమవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయం నుంచి గిడజాం సెంటర్, సినిమా సెంటర్, మార్కెట్‌సెంటర్ మీదగా శివాలయం వరకూ నిర్వహించారు. ఈ సందర్భంగా నాలుగేళ్ల సంక్షేమ పాలనకు మద్దతుగా రాష్ట్ర అధిష్టానం పిలుపు మేరకు ఈ ర్యాలీ నిర్వహించామన్నారు. ప్రతి ఒక్కరూ సంక్షేమ పాలనకు మద్దతుగా మరోసారి వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ఆదరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణం, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ వాసిరెడ్డి భాస్కర బాబు, డీసీసీబీ డైరెక్టర్ పులిమదు, మండల పార్టీ కన్వీనర్ జిగిరెడ్డి శ్రీను, పార్టీ నాయకులు కాకి నాని తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో 53 లక్షల పని దినాలు కల్పించడమే లక్ష్యం



స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మునగ నర్సరీని పరిశీలిస్తున్న రాంగోపాల్

గోకవరం: తూర్పుగోదావరి జిల్లాలో 53 లక్షల పని దినాలు కల్పించడమే లక్ష్యంగా పనిచేయడం జరుగుతుందని మండల ప్రత్యేక అధికారి, డ్వామా, సంచాలకులు జి.ఎస్ రాంగోపాల్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ఆధ్వర్యంలో పెంచుతున్న మునగ నర్సరీని సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.29వేల అంచనాతో నర్సరీని చేపడుతున్నామన్నారు. ప్రస్తుతం జిల్లాలో 18 మండలాల్లో 73 వేల మందికి పనులు కల్పిస్తున్నారు. గోకవరం మండలంలో 7వేల మందికి ఉపాధి హామీలో వివిధ పనులు ద్వారా వేతనాలు చెల్లిస్తున్నారు. ఆజాది కా అమృత్ మహోత్సవ్‌లో జిల్లాలో 75 చెరువులను అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఇప్పటికే 50 చెరువులను అభివృద్ధి పూర్తయ్యాయని, వర్షా కాలంలో కూడా ఉపాధి హామీ వేతనదారులకు పనులు కల్పిస్తామని తెలిపారు. రైతు పొలంలో కుంటలు తవ్వకం, కందకాలు, సరిహద్దు కందకాల, మిట్టి ముర్రం రోడ్లు, మొక్కలు పెంపకం వంటి పనులు జరుగుతాయన్నారు. మునగ నర్సరీలో పెంచిన మొక్కలను డ్వాక్రా గ్రూపుల ద్వారా ప్రతి ఒక్కరికి రెండు మునగ మొక్కలు పంపిణీ చేస్తామని తెలిపారు. ఆయన వెంట ఎంపీడీఓ, ఏపీఓ, టీఏలు ఉన్నారు.

## విజ్ఞానం, వినోదానికి వేసవి శిబిరాలు



ఏలేశ్వరం గ్రంథాలయంలో పాల్గొన్న విద్యార్థులు

ఏలేశ్వరం: విజ్ఞానం, వినోదానికి గ్రంథాలయాల్లో వేసవి శిబిరాలు నిర్వహిస్తున్నారని గణిత ఉపాధ్యాయుడు కన్నూరి సతీష్‌బాబు అన్నారు. సోమవారం పట్టణంలో లైబ్రేరియన్ కవికొండల సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన వేసవి శిక్షణలో సతీష్‌బాబు విద్యార్థులకు గణితంపై అవగాహన కల్పించారు. కొన్ని మెళకువలను నేర్పించారు. అనంతరం ఫార్ములాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు కల్పించిన వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులకు వివిధ కళలు, చిత్రలేఖనం, కథలు రాయడం, చదవడం, స్పోకెన్ ఇంగ్లీషు, మ్యాథ్స్, యోగతదితర అంశాలపై శిక్షణ ఇస్తున్నారన్నారు. విద్యార్థులువిధిగా విజ్ఞాన శిబిరాలకు హాజరుకావాలన్నారు.

## మేనిఫెస్టోను కాపీ కొట్టిన చంద్రబాబు

**కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి శివగణేష్**

గండేపల్లి: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు మహానాడులో విడుదల చేసిన మేనిఫెస్టో కాపీ కొట్టిందేనని, కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న పథకాలను టీడీపీ మేనిఫెస్టోగా చెప్పడం రాష్ట్ర ప్రజలను మరోసారి మోసం చేయడానికేనని కాంగ్రెస్ పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి మరోతి శివ గణేష్ ఎద్దేవా చేశారు. మండలంలోని నీలాద్రిరావుపేట దళితవాడ రామాలయం వీధిలో సోమవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికార దాహంతో ప్రజలను మోసగించే ప్రయత్నం చేయడం ఆయనకు పరిపాటిగా మారిందన్నారు. డ్వాక్రా పథకాన్ని తామే ప్రవేశపెట్టినట్టు గొప్పలు చెప్పుకోవడం చంద్రబాబుకు తగదని హితవు పలికారు. మేనిఫెస్టోలో ఎస్సీ, ఎస్టీల ప్రస్తావన లేకపోవడం ఆ పార్టీ వివక్ష ధోరణికి అద్దం పడుతుందన్నారు. 2013లో బ్యాక్‌లాగ్ నిధులు 25 వేల కోట్లు రీ షెడ్యూల్ చేయాలని ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 2013 నుంచి 2023 వరకు టీడీపీ, వైఎస్సార్ సీపీ ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు దుర్వినియోగం చేసి 25 వేల కోట్లను బ్యాక్ లాగ్ ఫండ్స్‌ను రీ షెడ్యూల్ చేసే వరకు కాంగ్రెస్ పార్టీ పోరాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వత్సవాయి బాబు, నక్క సత్యనారాయణ, అవసరాల సుధాకర్, గొంపా కొండబాబు, చంద్రమౌళి వెంకటరత్నం, కాటే జయ, యాల్ల కుమార్, తంగెళ్ల గణేష్, తదితరులు పాల్గొన్నారు.

# వలంటీర్ల సేవలు వెలకట్టలేనివి

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్
- వలంటీర్లకు సేవా పురస్కారాల అందజేత



రౌతులపూడిలో వలంటీర్లకు సేవా పురస్కారాలు అందజేసిన ఎమ్మెల్యే పర్వత ప్రసాద్



వేలంకలో వలంటీర్లను అభినందిస్తున్న దృశ్యం



ఇండుగపల్లిలో వలంటీర్లను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

రౌతులపూడి: సంక్షేమ పథకాలను ప్రజల ముంగిటకు చేర్చి ప్రభుత్వానికి వారికి వారధిగా నిలిచిన గ్రామ వలంటీర్ల సేవలు వెలకట్టలేనివని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఎం.గోవింద్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'వలంటీర్లకు వందనం' కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా గ్రామ వలంటీర్లు, సచివాలయాల వ్యవస్థను తీసుకువచ్చి వలంటీర్ల ద్వారా ఇంటిముంగిటికే సంక్షేమాన్ని అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిది అని కొనియాడారు. ప్రభుత్వానికి ప్రజలకు వారధులుగా పనిచేస్తున్న వలంటీర్లు అంతా స్థానిక నేతలతో కలసి మరోసారి వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మద్దతు పలికేలా ప్రజలను చైతన్యవంతులను చేయాలన్నారు. ఈ సందర్భంగా వలంటీర్లు అచ్చింత అశ్వని, బండి పుష్పలత, కాపారపు దయానందం, పూడి మణికంత, ఎస్.వీరఘునిలక్ష్మి, లవుడు అమ్మాజి, బి.గాయత్రికుమారిలకు ఎమ్మెల్యే శాలువాలు కప్పి, పూలమాలలతో ఘనంగా సత్కరించి, పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణం, మండల పరిషత్ ఉపాధ్యక్షులు సాయి, మండల వ్యవసాయ సలహాకమిటీ చైర్మన్ వాసిరెడ్డి భాస్కర బాబు, డీసీసీబీ డైరెక్టర్ పులి మదు, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సీహెచ్‌వీవీ సత్యనారాయణ, సర్పంచ్ కటారి అర్జునమ్మ, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ జిగిరెడ్డి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కోటనందూరు: ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఉండి ఎటువంటి ప్రతిఫలం ఆశించకుండా వలంటీర్లు నిస్వార్థ సేవలు అందిస్తున్నారని ఎంపీపీ లగుడు శ్రీనివాసు కొనియాడారు. వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని ఇండుగపల్లి, కేఈ చిన్నయ్యపాలెం, ఎస్సార్‌పేట గ్రామాల్లో వలంటీర్లను ఆయా గ్రామాల సర్పంచులతో కలిసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో లోవదేవస్థానం మాజీ చైర్మన్ లాలం బాబ్జీ, సర్పంచులు కుంచే సత్యవతి, రుత్తల రాజేశ్వరి, గుడ్ల సత్తిబాబు, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ, ఈఓపీఆర్డీ అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

కిర్లంపూడి: మండలంలోని బూరుగుపూడి, వేలంక గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో సోమవారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. వేలంక సర్పంచ్ రాయుడు స్వామి, బూరుగుపూడి సర్పంచ్ ఆసపు రామలక్ష్మి అధ్యక్షతనలో వలంటీర్లను సత్కరించారు. వేలంకలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా దోమాల గంగాధర్ పాల్గొన్నారు. తొలిత వలంటీర్లకు నగదు, ప్రశంస పత్రాలు అందజేసి, శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ గుత్తుర్తి రమణ, వైస్‌ప్రెసిడెంట్ పాఠంశెట్టి కృష్ణ, కార్యదర్శులు రామిశెట్టి వీర్రాజు, ఎంటీఆర్ రమేష్‌బాబు, స్కూల్ కమిటీ చైర్మన్ చేదులూరి శ్రీనివాసరావు, కన్వీనర్లు అడబాల శ్రీను, చిట్నీడి శివ, యూత్ సభ్యులు బేతాళ మహేష్, గృహసారథులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

### నిందితుడి అరెస్టు



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ కిషోర్‌బాబు

ఏలేశ్వరం: స్నేహితుడినే కడతేర్చిన నిందుడిని పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. సీఐ కె.కిషోర్‌బాబు ఆధ్వర్యంలో స్థానిక పోలీసు స్టేషన్‌లో నిందితుడిని విలేకరుల ముందు హాజరు పర్చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఈ నెల 27న స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కోరాడ మణికంఠను కారుతో ఢీకొట్టి చంపిన బొంటు దుర్గా ప్రసాద్‌ను అరెస్టు చేసినట్టు తెలిపారు. మణికంఠ తన కుటుంబాన్ని హతమార్చుతానని హెచ్చరించడంతో హత్య చేసినట్టు నిందితుడు ఒప్పుకున్నట్టు చెప్పారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చుతామన్నారు. పట్టణంలో ఇటీవల అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని వీటిపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై నిఘా ఉంచాలన్నారు. పిల్లలను పట్టించుకోకపోతే దుర అలవాట్లకు బానిసై చెడుమార్గం పట్టే ప్రమాదం ఉందన్నారు. సమావేశంలో ఎస్సై జి.సతీష్ సిబ్బంది పాల్గొన్నారు.

### యువత ఆత్మస్థైర్యం పెంచుకోవాలి

తుని: యువత పిరికితనాన్ని వీడి ఆత్మస్థైర్యాన్ని పెంచుకోవాలని సైకియాట్రిస్ట్ డాక్టర్ శాంతి సూచించారు. సోమవారం స్థానిక మారుతి డయాగ్నోస్టిక్స్ ఆధ్వర్యంలో యూత్ అవేర్‌నెస్ ప్రోగ్రాంలో భాగంగా సూసైడ్ నియంత్రణపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా డాక్టర్ శాంతి మాట్లాడుతూ యువతీ, యువకులంతా సమాజ పరిస్థితులు, మానవ జీవితంపై అవగాహన పెంచుకొని సమస్యలను అధిగమించాలన్నారు. సూసైడ్ చేసుకోడానికి దారి తీసే పరిస్థితులు, నివారణ మార్గాలపై ఆమె వివరించారు. సైకాలజిస్టు జి.శ్రీనివాసు స్ట్రెస్ నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గాయత్రీ విద్యాసంస్థల అధినేత రామచంద్రమూర్తి, మారుతీ డయాగ్నోస్టిక్స్ పరిపాలనాధికారి వద్దాది సత్యనారాయణ, పలువురు పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

## ప్రతి ఇంటా సంక్షేమ వెలుగులు

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్
- రాఘవపట్నంలో గడప గడపకూ మన ప్రభుత్వం



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే పర్వత

రౌతులపూడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. సోమవారం రాఘవపట్నంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే పార్టీ శ్రేణులతో కలసి ఆయన ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. అనంతరం వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఇంటిపట్టాలు మంజూరు చేయాలని, స్థానికంగా రామాలయ నిర్మాణానికి నిధులు కేటాయించాలని స్థానికులకు ఎమ్మెల్యేను కోరారు. గత కొంతకాలంగా నిలిచిపోయిన ఉపాధి పనులను తిరిగి ప్రారంభించాలని మొరపెట్టుకున్నారు. వెంటనే స్థానిక నేతలతో మాట్లాడి ప్రస్తుతం ఉన్న మేట్లలో చదువుకున్న ఒకరికి ఫీల్డ్ అసిస్టెంట్ బాధ్యతలు అప్పగించాలని ఆదేశించారు.

## రైతు సమ్మేళనం విజయవంతం చేయాలి

ప్రత్తిపాడు: విజయవాడలో జూన్ 5వ తేదీన జరుగనున్న గోఆధారిత ప్రకృతి వ్యవసాయ రైతుల మహాసమ్మేళనాన్ని విజయవంతం చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ (బీకేఎస్) రాష్ట్ర కార్యదర్శి కౌలూరి పతిరాజు కోరారు. ప్రత్తిపాడు మునసబు గారి రామాలయ ఆవరణలో సోమవారం సాయంత్రం బీకేఎస్ కాకినాడ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా వచ్చిన కౌలూరి పతిరాజు మాట్లాడారు. బీకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాసంశెట్టి రాజా అధ్యక్షతన జరిగిన ఈ సభలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యల్లపు సూర్యనారాయణ, కార్యవర్గ సభ్యులు ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

కిర్లంపూడి: తామరాడ జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 2004–05 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు సోమవారం కలుసుకున్నారు. ఆ పాఠశాలలోనే అందరూ కలుసుకొని ఒకరినొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకొని గత జ్ఞాపకాలను గుర్తుచేస్తున్నారు. అనంతరం వినూత్న కార్యక్రమాలు, ఆటపాటలతో సాయంత్రం వరకూ ఆనందంగా గడిపారు. తొలిత వారికి విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సంగన్‌దొర, అడపా దుర్గారావు, నక్కా రాయుడు, ఎ.చక్రధర్, సునిత, వెంకట లక్ష్మీ, సాయిపవన్ పలువురు ఉన్నారు.